సాక్షి నంద్యాల

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



అలరించిన భరతనాట్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళారాధన వేదికపై గురువారం కృష్ణ జిల్లా సాయికృష్ణ అకాడమీ వారి భరతనాట్యం అలరించింది. పలు భక్తి గీతాలకు నృత్యం చేశారు.



ట్రాక్టర్ విరాళం

మహానంది: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నంద్యాల బ్రాంచ్ అధికారులు గురువారం మహానంది దేవస్థానానికి రూ.7లక్షల విలువ చేసే మహీంద్రా కంపెనీ ట్రాక్టర్‌ను విరాళమిచ్చారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.85
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,784
అవుట్ ఫ్లో	: 14,981

న్యూస్‌రీల్

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. అవుకు మండలంలో 48.2, ఆత్మకూరు 16.4, పాములపాడు 13.6, మహానంది 13.2, డోన్ 10.4, నంద్యాల, బనగానపల్లె 9.8, ప్యాపిలి 9.2, కొత్తపల్లి 8.6, వెలుగోడు 7.2, గోస్పాడు 5.2, బండిఆత్మకూరు 5.0, రుద్రవరం 4.6, పగిడ్యాల 2.8, చాగలమర్రి, గడివేముల 2.4 చొప్పున, కొలిమిగుండ్ల 1.8, కోవెలకుంట్ల 1.6, ఆళ్లగడ్డ 1.0, శ్రీశైలం 0.4 మి.మీ వర్షం కురిసింది.

టెట్‌కు 52 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్‌వీఆర్, రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజీలలో గురువారం జరిగిన టెట్ పేపర్–1ఏకు 52 మంది గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం సెషన్స్‌లో 235 మందికి గాను 207 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం సెషన్స్‌లో 236 మందికి గాను 212 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

నంద్యాల: ఈనెల 14 న పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు, మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ఉన్న నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి జిల్లా కేంద్రానికి రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పండుగకు ప్రత్యేక బస్సులు

నంద్యాల(న్యూటౌన్): దసరా పండుగకు వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు చేరుకునే ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపేందుకు సిద్ధమైంది. ప్రీ దసరా, పోస్ట్ దసరా పేరుతో ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా పరిధిలోని ఆళ్లగడ్డ డిపో 11, ఆత్మకూరు 10, బనగానపల్లె 11, డోన్ 10, కోవెలకుంట్ల 12, నంద్యాల డిపో నుంచి 25 చొప్పున ప్రత్యేక బస్సులను తిప్పేందుకు నిర్ణయించారు. అలాగే ప్రీ దసరా సందర్భంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, చెన్నై, బస్సులతోపాటు ఇతర ప్రాంతాలకు 77 సర్వీసులను నడపనున్నారు. పండుగ ముగిసిన తర్వాత ఆయా డిపోల నుంచి విజయవాడ, హైదరాబాదుకు, బెంగళూరు, చెన్నై, ఇతర ప్రాంతాలకు సర్వీసులను నడిపేలా చర్యలు చేపట్టారు. ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఆర్‌ఎం రిజియాసుల్తానా సూచించారు.

ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పెద్ద పులిరాజుపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల ఈ బ్రాంచ్‌లో వెలుగు చూసిన కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కుంభకోణం కేసులో పులిరాజు ఏ3 నిందితుడిగా ఉన్నారు. మేనేజర్‌పై కూడా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిందున సస్పెన్షన్ వేటు వేశారు. మేనేజర్ పులిరాజు పర్యవేక్షణ లోపించడం వల్లనే రెండు నెలలుగా నిధుల మళ్లింపు వ్యవహారం జోరుగా సాగినట్లు తెలుస్తోంది. మొత్తం రూ.78,77,767 నిధులు కాజేసినట్లు నిర్ధారణ అయింది. బ్రాంచ్‌లో మొత్తం ముగ్గురిపై సస్పెన్షన్ వేటు పడింది. నిందితులను పోలీసులు అరెస్ట్ చేయాల్సి ఉంది.

శ్రీశైలంలో 197.0114 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రానికి 197.0114 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 881.60 అడుగులకు చేరుకుంది. జూరాల, సుంకేసుల నుంచి క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. బుధవారం నుంచి గురువారం వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 89,034 క్యూసెక్కుల నీరు రాగా, దిగువ ప్రాజెక్ట్‌లకు 71,230 క్యూసెక్కుల నీరు విడుదలయ్యింది. కుడిగట్టు కేంద్రంలో 10.593 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.474 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ

నంద్యాల(అర్బన్): గంబూషియా చేపలతో దోమల నివారణ సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ తెలిపారు. నీటి నిల్వలున్న స్థానిక జగజ్జననీనగర్‌లో గురువారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి గంబూషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో నీటి నిల్వలున్న ప్రాంతాల్లో దోమల నివారణకు 40 వేల గంబూషియా చేపలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటి నిల్వలున్న ప్రదేశాల్లో ఆయా సబ్ యూనిట్ అధికారి పర్యవేక్షణలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గంబూషియా చేపలను విడుదల చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు పాల్గొన్నారు.



జులై 7న..

ముచ్చుమర్రి గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికను ముగ్గురు బాలురు అత్యాచారం చేశారు. విషయం ఎక్కడ బయటపడుతుందోనని ఆ చిన్నారిని గొంతు నులిమి చంపేశారు. మా అమ్మాయి కనిపించడం లేదని చిన్నారి తల్లిదండ్రులు జులై 7న ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే రెండు రోజుల వరకు పట్టించుకోలేదు. ఆ తర్వాత పోలీసుల విచారణలో స్మార్ట్‌ఫోన్‌లో వీడియోలు చూసి.. అదేమాదిరిగా చిన్నారితో చేశామని ముగ్గురు మైనర్లు వెల్లడించారు.

ఆగస్టు 28న..

మతిస్థిమితం లేని 14 ఏళ్ల బాలికపై ముగ్గురు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ అమానుష ఘటన కోవెలకుంట్ల పట్టణంలోని శ్రీరాంనగర్‌లో ఆగస్టు 28న జరిగింది. సంతోష్ నాయక్, సుభాష్, అజయ్ అనే ముగ్గురు యువకులు బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేస్తూ వచ్చారు. ఆ సమ యంలో సెల్‌ఫోన్‌లో వీడియోలు, ఫొటోలు తీసి పైశాచికానందం పొందేవారు. వీడియోలు వైరలవ్వడంతో పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేశారు.

అక్టోబర్ 9న..

తాజాగా డోన్ మండలం మల్యాల గ్రామంలో అమానుష ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలుడిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు టీడీపీ నేతల కుమారులు (ఒకరు మేజరు, ఇద్దరు మైనర్లు) లైంగిక దాడికి పాల్పొడ్డారు. ఈ నీచాన్ని వీడియోలు తీసుకోవడంతో అవి వైరల్ కావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అమ్మో.. మృగాళ్లు

చిన్నారులపై ఆగని అఘాయిత్యాలు

- చిన్న వయస్సులోనే ఉన్మాదులుగా మారుతున్న మైనర్లు
- మొన్న ముచ్చుమర్రి.. నిన్న కోవెలకుంట్ల.. నేడు మల్యాలలో ఘటనలు
- గత మూడు నెలల వ్యవధిలో జిల్లాలో ఎనిమిది పోక్సో కేసుల నమోదు

చిన్నారులపై లైంగికదాడులు.. యువతపై అక్రమ కేసుల బనాయింపు.. అన్యాయాలను ఎదురించే వారిని అంతమొందించడమే లక్ష్యంగా సాగుతున్న కూటమి ప్రభుత్వానికి.. వేటూరి రాసిన 'దుర్యోధన, దుశ్యాసన, దుర్వినీతి లోకంలో' పాట అతికినట్టు సరిపోతుంది. సమాజంలో చోటుచేసుకుంటున్న ఆకృత్యాలను అరికట్టలేని ప్రభుత్వాలను కన్నులుండి చూడలేని ధృతరాష్ట్రుడి పాలనతో పోల్చాడు. అచ్చం అలాంటి పాలనే ఇప్పుడు జిల్లాలో కొనసాగుతోంది. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలల కాలంలోనే ముచ్చుమర్రిలో బాలికపై లైంగిక దాడి, హత్య, కోవెలకుంట్లలో మతిస్థిమితం లేని బాలికపై అఘాయిత్యం.. తాజాతా డోన్‌లో బాలుడిపై టీడీపీ నేతల కుమారులు వికృత చేష్టలు ప్రజలను భయపెడుతున్నాయి.



సాక్షి, నంద్యాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైం రేట్ విపరీతంగా పెరిగిపోతోంది. ప్రతీ రోజు ఏదో ఒక ప్రాంతంలో క్రైం జరుగుతూనే ఉంది. నిందితులకు అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే రాజకీయ దాడులతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతుండగా మరో వైపు మహిళలు, చిన్నారుల మానప్రాణాలకు రక్షణ కరువైంది. ఎన్నడూలేని విధంగా చిన్నారులపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయి. నేరాలను అరికట్టాల్సిన పోలీసులే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పోలీసుల కళ్లముందే సీతారామపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త సుబ్బరాయుడిని అత్యంత కిరాతకంగా హత్య చేయడమే ఇందుకు నిదర్శనం. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, నేర స్వభావం ఉన్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడంలో జిల్లా పోలీసు యంత్రాంగం చేతులెత్తేసింది. దీంతో ప్రతి పది రోజులకు ఒక చోట చిన్నారులపై అకృత్యాలు జరుగుతున్నాయి. ముచ్చుమర్రి బాలిక హత్యాచారంతో మొదలైన ఆకృత్యాల పర్వం నేటికీ ఆగడం లేదు. అభంశుభం తెలియని పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నా అడ్డుకునే వ్యవస్థే కనిపించడం లేదు. కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు తొమ్మిది మంది చిన్నారులపై లైంగిక దాడులు జరిగాయి. ముచ్చుమర్రి, అవుకు, కోవెలకుంట్ల, మిడుతూరు, బండి ఆత్మకూరు, నంద్యాల పట్టణంలో పోక్సో కేసులు రివాజుగా మారాయి. అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు వింటూ అందినకాడికి దోచుకుతిందామనే ధ్యాసలోనే అధిక శాతం పోలీసులు ఉన్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చోటుచేసుకున్న ఘటనలు

- సెప్టెంబర్ 1న అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి బాలికపై అదే గ్రామానికి చెందిన ప్రభుదాస్ అత్యాచారానికి పాల్పడ్డాడు.
- సెప్టెంబర్ 19న బేతంచెర్ల సిమెంట్ నగర్‌కు చెందిన బాలికను బండి ఆత్మకూరు మండలం పార్నపల్లెకు చెందిన యువకుడు ప్రేమ పేరుతో అత్యాచారానికి పాల్పడ్డాడు.
- సెప్టెంబర్ 25న మిడుతూరు మండలం నాగలూటి గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన వడ్డే ఎల్లరాజు(22) అత్యాచారానికి పాల్పడ్డాడు.
- అక్టోబర్ 9న డోన్ మండలం యు. కొత్తపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి సుధీర్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదైంది.
- జిల్లా కేంద్రమైన నంద్యాలలో రెండు పోక్సో కేసులు నమోదయ్యాయి.



చిన్నారిపై లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగులోకి

వెలుగోడు: మండల పరిధిలోని బోయ రేవుల గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 1న బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఇంటి పక్కనే ఉన్న బాలుడు మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికీ చెప్పొద్దని భయపెట్టాడు. రోజూ నొప్పి అంటూ బాలిక ఏడుస్తుండగా ఏమైందని తల్లి ఆరా తీయగా.. జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో ఈనెల 9న నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విష్ణు నారాయణ నిందితుడిని అరెస్టు చేసి, పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ పద్మజ, నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బరాయుడు, కేసీ కెనాల్ ఈఈ ప్రకాష్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ రఘురాం రెడ్డి, ఎస్సార్‌బీసీ ఎస్ఈ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 16 నుంచి జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రారంభమై నవంబర్ 24వ తేదీ వరకు వివిధ దశలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో స్థిరీకరించిన ఆయకట్టుదారుల ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు కింద 18 మండలాల్లో స్థిరీకరించిన 1,31,079 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, కేసీ కెనాల్ కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,592 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, ఎస్సార్‌బీసీ కింద 9 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,925 ఎకరాలకు సంబంధించి 50 సాగునీటి వినియోగదారుల సంఘాలు, మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 43,200 ఎకరాలకు సంబంధించి 105 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి స్థిరీకరించిన ఆయకట్టును బట్టి ప్రాదేశిక నియోజకవర్గాల వర్గీకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. ఈనెల 16న షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రాజెక్టుల వారీగా సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. డీఆర్ఓ పద్మజ, ఇరిగేషన్ ఎస్ఈ వరప్రసాద్ ఎన్నికల నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారన్నారు. మాస్టర్ ట్రైనర్లుగా డోన్ ఆర్‌డీఓ మహేశ్వర్‌రెడ్డి, ఏఈఈ విజయ్‌కుమార్‌ను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

నందివాహనంపై దేవదేవులు

- శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు
- మహాగౌరి స్వరూపంలో భ్రామరీ
- నేడు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ



నందివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో దేవీశరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు గురువారం భ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని మహాగౌరి స్వరూపంలో అలంకరించారు. ఎదురుగా ఏర్పాటుచేసిన వేదికపై మహాగౌరీ మాతను ఆశీనులను చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు, వేదపండితులు విశేష పూజ, హారతులిచ్చారు. నవదుర్గలలో మహాగౌరి రూపం అత్యంత శాంతమూర్తిగా చెప్పబడుతుంది. తెల్లని వస్త్రాలను ధరించి, చతుర్భుజాలను కలిగిన ఈ దేవిని పూజించడం వల్ల సకల పాపాలు నశించి, కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

నందివాహన సేవలో దేవదేవులు

భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను నందివాహనసేవపై అలంకరించారు. అలంకార మండపంలోకి నంది వాహనాన్ని అధిష్టించిన స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేయించి అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజా హారతులిచ్చారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు. వర్షం కారణంగా ఆలయ ప్రదక్షిణ, గ్రామోత్సవాన్ని రద్దు చేశారు.

శ్రీశైలంలో నేడు..

తొమ్మిదో రోజైన శుక్రవారం భ్రమరాంబాదేవి సిద్ధిదాయిని అలంకారంలో, స్వామిఅమ్మవార్లు అశ్వవాహనసేవలో దర్శనమిస్తారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.

పట్టువస్త్రాల సమర్పణ

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరై స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఉత్సవంలో కళాకారుల నృత్యాలు



దసరా ఉత్సవాలల్లో భాగంగా కళారూపాలు

మద్యం దుకాణాలకు పోటాపోటీ

- ఉమ్మడి జిల్లాలో 4,100 దరఖాస్తులు దాఖలు
- నేటి రాత్రి 7 గంటలకు గడువు ముగింపు
- 14న ఎక్సైజ్ టెండర్లు లక్కీడిప్

కర్నూలు/బొమ్మలసత్రం: ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి పోటీ నెలకొంది. ఇప్పటి వరకు ఈ రంగంలో లేనివారు కూడా దరఖాస్తు చేస్తున్నారు. దరఖాస్తుల దాఖలులో కర్నూలు ముందంజలో ఉంది. ఈనెల 1వ తేదీన దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ వారం రోజుల పాటు మందకొడిగా సాగింది. రెండు రోజులుగా దరఖాస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మంత్రాలయం నియోజకవర్గంలో అతి తక్కువ దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇక్కడ అధికార పార్టీ నేతల ప్రభావం కనిపిస్తోంది. నియోజకవర్గ పరిధిలో (కోసిగి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో) 4 దుకాణాలకు నోటిఫికేషన్ వెలువడగా కేవలం 40 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. కర్నూలు జిల్లాలోని 7 ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 99 దుకాణాలకు గాను గురువారం సాయంత్రం 7 గంటల సమయానికి 2,400 దరఖాస్తులు వచ్చాయి. నంద్యాల జిల్లాలోని 7 ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 105 దుకాణాలకు 1,627 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,119 దాఖలయ్యాయి. నంద్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 584 దాఖలయ్యాయి. ఇక్కడ ఎక్కువ వ్యాపారం సాగుతుందని వ్యాపారులు నమ్ముతున్నారు. బాగా ఆదాయం వచ్చే దుకాణాల వివరాలను సేకరించి వాటిని చేజిక్కించుకునేందుకు పోటీ పడుతుండటంతో అధిక దరఖాస్తులు వస్తున్నాయి. ఎవరికి లాటరీ తగిలినా కలసి చేసుకుంటేనే నాలుగు రూపాయలు మిగులుతాయి. లేకుంటే నష్టపోతామని సిండికేట్‌లో భాగస్వాములుగా ఉన్న మద్యం వ్యాపారుల సంభాషణల్లో వ్యక్తమవుతోంది. మద్యం వ్యాపారంలో గతంలో అనుసరించిన విధానాన్నే అవలంభించాలని కర్నూలులో నిర్ణయించారు. ఒక్క కోసిగి మినహా జిల్లాలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఆశించిన స్థాయిలోనే దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలో కర్నూలు ఎక్సైజ్ జోన్ దరఖాస్తుల దాఖలులో 8వ స్థానంలో ఉంది.

ఎప్పుడెప్పుడు ఏం చేస్తారు

11వ తేదీ రాత్రి 7 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది. 12, 13 తేదీల్లో వాటిని పరిశీలన చేస్తారు. 14న ఉదయం కర్నూలు జిల్లాకు సంబంధించి జిల్లాపరిషత్ సమావేశ భవనంలో, నంద్యాల జిల్లాకు సంబంధించి కలెక్టరేట్‌లో కలెక్టర్ల సమక్షంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తారు. 15వ తేదీ వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే వ్యాపార లావాదేవీలు కొనసాగుతాయి. 16వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తాయి.



బనగానపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తులు అప్‌లోడ్ చేస్తున్న దృశ్యం

రెండేళ్లలో రూ.138.27 కోట్ల రాబడి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 204 మద్యం దుకాణాలకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేయగా ఇందులో ఏడాదికి రూ.55 లక్షలు చెల్లించే దుకాణాలు 69, రూ.65 లక్షలు చెల్లించే దుకాణాలు 135 ఉన్నాయి. రెండో ఏడాది ఒక దుకాణంపై 15 శాతం లైసెన్స్ రుసుము అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మొదటి ఏడాది రూ.55 లక్షలు చెల్లించే దుకాణం రెండో ఏడాది రూ.60.50 లక్షలు, రూ.65 లక్షలు చెల్లించే దుకాణం 71.50 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వానికి తొలి ఏడాది కర్నూలు జిల్లాలో రూ.63.55 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.62.15 కోట్లు కలిపి రూ.125.70 కోట్లు, రెండో ఏడాది పది శాతం అదనంగా కలిపి రెండేళ్లకు రూ.138.27 కోట్లు రాబడి రానుంది. ఇది కాకుండా మద్యం దుకాణాల కోసం వేసే ప్రతి దరఖాస్తుకు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉండటంతో ఈ మొత్తం రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.

భయం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు



ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరుగుతోంది. ఎక్కడి నుంచైనా ఎవరైనా ఎలాంటి భయం లేకుండా, ఇబ్బందులకు అవకాశం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియకు ఎవరు భంగం కలిగించినా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. కేవలం ఒకరోజు మాత్రమే ఉండటంతో వ్యాపారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీదేవి, ఎక్సైజ్ కర్నూలు జోన్ డిప్యూటీ కమిషనర్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తులు ఇలా...

ఎక్సైజ్ స్టేషన్	దుకాణాల సంఖ్య	దరఖాస్తుల సంఖ్య
కర్నూలు	31	1,119
కోడుమూరు	14	400
ఆదోని	12	215
ఆలూరు	9	167
ఎమ్మిగనూరు	15	228
కోసిగి (మంత్రాలయం)	4	40
పత్తికొండ	14	245
మొత్తం	99	2,450
నంద్యాల జిల్లా...		
ఆళ్లగడ్డ	19	262
ఆత్మకూరు	13	164
బనగానపల్లె	12	120
డోన్	16	251
కోవెలకుంట్ల	11	110
నందికొట్కూరు	10	136
నంద్యాల	24	584
మొత్తం	105	1627

క్లుప్తంగా

మార్కెట్ యార్డుకు మూడు రోజులు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సెలవులు ఉన్నందున వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగవని ఎంపిక శ్రేణి సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం మహర్నవమి, 12న విజయదశమి సెలవులు ఉన్నాయని, 13న ఆదివారం సెలవు దినమని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 14వ తేదీ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు యథావిధిగా జరుగుతాయని, రైతులు గమనించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


ఆంజనేయులు (ఫైల్)

ఆదోనిఅర్బన్: మండలంలోని గోనబావి గ్రామ సమీపంలోని ఆస్పరి రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆంజనేయులు (49) అనే వ్యక్తి గురువారం మృతిచెందాడు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు.. ఆస్పరికి చెందిన ఆంజనేయులు ఆదోని ఇందిరానగర్ కాలనీలో నివాసముంటున్నాడు. గోనబావి గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకులో పనిచేస్తున్నారు. గురువారం టీ తాగేందుకు వెళ్తూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లలిత, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని టోల్‌గేట్ వద్ద సీఐ ప్రసాద్‌రావు సిబ్బందితో గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ తెలిపిన వివరాలు.. ఆటోలో ఎనిమిది బస్తాల (400 కేజీలు) బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు తనిఖీ పోలీసులు గుర్తించారు. నిందితులు పల్నాడు జిల్లాకు చెందిన ఆవుల నాగరాజు, గొల్ల పాపారావు, తెలంగాణ రాష్ట్రం మున్ననూరుకు చెందిన మూడవత్ మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని బియ్యం స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు మహేష్ రఘునాథుడు, నానునాయక్, శివ మహేందర్‌రెడ్డి, నాగవేణి తదితరుల సహకారంతో నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

సబ్సిడీపై నూలు సరఫరా

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత కార్మికులకు రా మెటీరియల్ సప్లై స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం 15 శాతం సబ్సిడీపై నూలు సరఫరా చేయనుందని ఉమ్మడి కర్నూలు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగరాజరావు తెలిపారు. చేనేత కార్మికులు, సొసైటీల్లో సభ్యులుగా ఉన్న చేనేతకారులకు, చేనేతకారులు సభ్యులుగా ఉన్న స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబులిటీ గ్రూపులు(జేఎల్‌జీ), మాస్టర్ వీవర్‌లకు కూడా సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. సబ్సిడీని నేరుగా చేనేతకారుల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా విడుదల చేయడం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని చేనేతకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.


ఆదోని అర్బన్: గవ్వల అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ


మహానంది: నందివాహనంపై కొలువైన మహాగౌరి


బనగానపల్లె రూరల్: నందవరంలో చౌడేశ్వరిదేవి


కర్నూలు కల్చరల్: లలితా పీఠంలో లలితా సుందరి దేవి

మహాగౌరీ నమోస్తుతే

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం అమ్మవారు మహాగౌరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. జిల్లావ్యాప్తంగా ఆయా ఆలయాల్లో నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహానందిలో రాత్రి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు సహస్రదీపాలంకరణ సేవ అనంతరం నంది వాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. నందవరంలో వెలసిన చౌడేశ్వరి మాత మహాగౌరి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆదోని పట్టణంలో వెలసిన మహాయోగి లక్ష్మమ్మవ్వను గవ్వలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొలనుభారతి ఆలయంలో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

గుర్రాల పారువేటకు వేళాయె


రాచరిక దుస్తుల్లో యాదవరాజు వంశీయులు (ఫైల్)

మద్దికెర: విజయదశమి రోజున సాంప్రదాయ పోటీకి రంగం సిద్ధమైంది. మద్దికెరలో 3 శతాబ్దాలుగా దసరా పండుగ పురస్కరించుకుని అశ్వాల పారువేట అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వేలల్లో ప్రజలు తరలివస్తారు. దసరా రోజు యాదవ రాజవంశీకులు గుర్రాలపై స్వారీ చేయడం ప్రత్యేకం. మద్దికెరలో పెద్దనగరి, చిన్న నగరి, యామనగరి అనే మూడు కుటుంబాల వారు దసరా వేడుకలు నిర్వహిస్తారు. ఈ నెల 12న ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో కుటుంబం నుంచి రెండు లేక మూడు గుర్రాలను స్వారీకి పంపుతారు. గుర్రాలకు నెలరోజుల పాటు శిక్షణ ఇస్తారు. మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలో ఉన్న బొజ్జనాయుని పేట భోగేశ్వరాలయం నుంచి మద్దికెర వరకు రోజూ స్వారీ చేస్తారు.

విజయం సాధిస్తే ఆనందం.

పాలెగాళ్లుగా పేరుగాంచిన ఈ కుటుంబీకులు తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార సాంప్రదాయాలను నేటికీ కొనసాగిస్తున్నారు. అందులో గుర్రాల పారువేట ఒకటి. యాదవ రాజవంశీకులు దసరా రోజున గుర్రాలపై కూర్చొని తలపాగా ధరించి రాచరిక వస్త్రధారణలో ఖడ్గం చేతబట్టి మేళ తాళాలతో మద్దికెరకు 3 కి.మీ దూరంలో నాటి యాదవరాజులు నిర్మించిన బొజ్జనాయినిపేట గ్రామంలోని భోగేశ్వర ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తారు. అశ్వరోహుల వెంట 'మద్ది' కులస్తులు సైన్యంలాగా ఆయుధాలు ధరించి వెళతారు. అక్కడి నుంచి పోటీ ప్రారంభించి గుర్రపు స్వారీ చేస్తూ మద్దికెరకు చేరుకుంటారు. విజయం సాధించిన వారిని గ్రామంలో మొదటగా ఊరేగిస్తారు. ఈ వేడుకలు ఏటా చూపరులకు కనువిందు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

బైకు నుంచి పడి మహిళ మృతి


బొజ్జ రాజేశ్వరి (ఫైల్)

కొత్తపల్లి: బైక్ నుంచి జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎం.లింగాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని గోకవరం గ్రామపంచాయతీ మజారా గ్రామం బట్టువారిపల్లికి చెందిన బొజ్జ సాయిబాబా పాములపాడుకు చెందిన రాజేశ్వరిని కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. పదేళ్ల క్రితం రాజేశ్వరి బతుకుదెరువు కోసం కుమారుడితో కలిసి పాములపాడుకు చేరుకుంది. సాయిబాబా సొంత ఊరిలో తనకున్న నాలుగెకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. ఈ ఏడాది మొక్కజొన్న సాగు చేశారు. పంట కోత కోసి ధాన్యం ఆరబెట్టారు. ఈ క్రమంలో గురువారం పాములపాడు నుంచి దంపతులు ఏపీ 39 ఆర్ఎం 1866 టీవీఎస్ ఎక్సెల్‌పై బట్టువారిపల్లిలోని పొలం వద్దకు వెళుతున్నారు. ఎం.లింగాపురం గ్రామ సమీపంలో భర్త నిర్లక్ష్యంగా నడపడం వల్ల వెనక కూర్చున్న రామేశ్వరి (45) జారి రోడ్డుపై పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను భర్త, స్థానికుల సాయంతో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రమాదంపై కుమారుడు బొజ్జ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.కేశవ వెల్లడించారు.

యువకుడి దుర్మరణం


మృతిచెందిన ఆంజనేయులు

కోసిగి: స్థానిక సిద్ధారూఢ ఆశ్రమం సమీపంలో నివాసం ఉంటున్న చిన్నంపల్లి తిమ్మయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు అంజనేయులు (17) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని జుమ్మాలదిన్నె గ్రామం నుంచి ఆంజనేయులు బైక్‌పై వస్తుండగా స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలో అదుపుతప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే అంబులెన్స్‌లో మృతి చెందినట్లు ఈఎంటీ రామకృష్ణ తెలిపారు. చేతికి అందివస్తున్న కొడుకు చనిపోవడంతో కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి.

హ్యాండ్‌బాల్ విజేత వైజాగ్ జట్టు


విజేత వైజాగ్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రం షబ్బీర్, ఖీజర్

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 53వ సీనియర్ మెన్స్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో వైజాగ్ జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన ఫైనల్‌లో వైజాగ్ జట్టు గెలుపొందగా వెస్ట్ గోదావరి జట్టు రన్నరప్‌గా, సత్యసాయి, అనంతపురం జిల్లా జట్లు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో వెస్ట్ గోదావరి జట్టుపై వైజాగ్ జట్టు 3–7 పాయింట్ల తేడాతో గెలుపొందింది. విజేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, వ్యాపారవేత్తలు చక్రం ముల్లా షబ్బీర్ ఆహ్మద్, షేక్ ఖీజర్, ఎస్ఎండీ ఇంతియాజ్ ట్రోఫీ, మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. టోర్నీ నిర్వహణకు సహకరించిన దాతలను అసోసియేషన్ తరపున రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, ప్రచార కార్యదర్శి రఫీ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సాఫ్ట్‌బాల్ పోటీలు


విజేత తెలంగాణ బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలలోని గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన 42వ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థలు, రామకృష్ణ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో చివరిరోజు జిల్లా ఏఎస్పీ యుగంధర్‌బాబు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు రవికృష్ణ, సాఫ్ట్‌బాల్ క్రీడా ప్రతినిధులు మౌర్య, నాగేంద్ర, విజయకుమార్, విద్యావేత్త షేక్షావలిరెడ్డితో పాటు 23 రాష్ట్రాల నుంచి ఆయా జట్ల సెక్రటరీలు పాల్గొన్నారు.అతిథులు మాట్లాడుతూ.. క్రీడాకారులు నిత్యం నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. అనంతరం హోరాహోరీగా సాగిన పోటీల్లో మహారాష్ట్ర జట్టు విజేతగా నిలవగా ద్వితీయ స్థానంలో రాజస్థాన్, తృతీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్ జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో విజేతగా తెలంగాణ, ద్వితీయ స్థానంలో పంజాబ్, తృతీయ స్థానంలో మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి. విజేతలకు బహుమతులతో పాటు మొమెంటోలను అందజేశారు.

పండగ సంతకు వెళ్లి మృత్యువాత


- భైకులు ఢీకొని ఒకరి మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

డోన్ రూరల్: పండగ సంతకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో కమలాపురం గ్రామానికి చెందిన కుమ్మరి షేక్షావలి (30) మృతి చెందాడు. అతని కుమారుడితో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. దసరా పండగ సంత కోసం తండ్రి షేక్షావలి, కుమారుడు పవన్‌కుమార్ బైక్‌పై డోన్ పట్టణానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. కమలాపురం గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీకుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా షేక్షావలి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పవన్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో బైక్‌పై వచ్చి ఢీకొట్టిన వెంకటేశ్వర్లుకు కూడా తీవ్రగాయాలు కావడంతో కర్నూలుకు తరలించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

షేక్షావలి మృతి విషయం తెలుసుకున్న గ్రామ నాయకుడు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

దాతృత్వ ధీరుడికి అక్షర నివాళి


అక్షరాలతో రతన్ టాటా చిత్రం

నంద్యాల(అర్బన్): పారిశ్రామిక దిగ్గజం, దాతృత్వ ధీరుడు రతన్ టాటాకు పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ గురువారం అక్షరాలతో నివాళి అర్పించారు. ఆయన్ను స్మరించుకుంటూ ఏ3 డ్రాయింగ్ చార్ట్‌పై మైక్రో పెన్నుతో ఆయన స్థాపించిన పరిశ్రమలు, కల్పించిన ఉపాధి, కలిసిన మహానీయులు, దాతృత్వాల గురించి వివరిస్తూ అక్షరాలతో రతన్ టాటా రూపాన్ని చిత్రించారు. రతన్ టాటా భౌతికంగా లేకపోయినా అందరి హృదయాల్లో శాశ్వతంగా ఉంటారని కొనియాడారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన పారా రంగస్వామి (53) గురువారం తోటలో పాముకాటుకు గురై మృతి చెందాడు. వివరాలు.. పారా రంగస్వామి సాయంత్రం తోటకు వెళ్లి పనులు చేస్తుండగా కాలికి పాము కాటు వేసింది. ముల్లు గుచ్చుకుందనుకొని ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటికి స్పృహతప్పి పడిపోవడంతో చుట్టు పక్కల వారు వైద్య పరీక్షల కోసం గుంతకల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించినట్లు బంధువులు తెలిపారు. మృతుడి భార్య సులోచన 15 ఏళ్ల క్రితమే మరణించింది. కుమారుడు విశ్వవర్ధన్ బీటెక్ చదువుతున్నారు.

బాలుడికి పాము కాటు

మిడుతూరు: స్థానిక ఎస్సీ కాలనీలో ఇంటిముందు ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడికి పాము కాటు వేసింది. కోడుమూరు తాలుకా గుడూరుకు చెందిన రవికుమార్, సులోచన దంపతుల కుమారుడు వరుణ్ (3) దసరా సెలవులకు తాతగారింటికి మిడుతూరుకు మూడు రోజుల క్రితం వచ్చాడు. గురువారం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా కుడి కాలికి పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తీసుకురావడంతో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించినట్లు చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ తిరుపతి తెలిపారు.

ఆర్టీఓ అధికారులమంటూ వసూళ్లు

- ఇద్దరి అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణ పరిధిలో ఆర్టీఓ అధికారులమంటూ వసూళ్లకు దిగిన ఇద్దరిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులు బుధవారం రాత్రి ఒక వాహనాన్ని ఆపి రికార్డులు సక్రమంగా లేకపోవడంతో రూ.లక్ష డిమాండ్ చేశారని సీఐ శ్రీరామ్ తెలిపారు. వాహనదారుడు రూ.1500 ఇస్తానని చెప్పినా వినకుండా బెదిరించడంతో గూగుల్‌లో తన ఫోన్ నంబర్ వెతికి సమాచారం అందించాడని చెప్పారు. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులను శుక్రవారం రిమాండ్‌కు పంపుతామని సీఐ వెల్లడించారు.

ఐదుగురికి బైపాస్ సర్జరీ విజయవంతం


ఆపరేషన్ అనంతరం కోలుకున్న వారితో డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వారం వ్యవధిలో ఐదుగురికి బీటింగ్ హార్ట్ పద్ధతిలో నిర్వహించిన బైపాస్ సర్జరీ విజయవంతం అయ్యిందని సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. ఆసుపత్రిలో గత వారం కార్డియోథొరాసిక్ విభాగంలో ఐదుగురికి ఆపరేషన్లు నిర్వహించామన్నారు. ఇందులో నంద్యాల జిల్లా రుద్రవరంకు చెందిన రామలింగేశ్వరి, పలుకూరుకు చెందిన కనకన్న, కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన సరస్వతి, మంత్రాలయంకు చెందిన శ్రీనివాసులు, దేవనకొండకు చెందిన గౌస్ ఉన్నారన్నారు. వీరికి నిర్వహించిన ఆపరేషన్లన్నీ కాంప్లికేటెడ్ అని తెలిపారు. ఈఎఫ్ తక్కువగా ఉన్నాయని, అయినప్పటికీ బీటింగ్ హార్ట్ పద్ధతిలో ఆపరేషన్ చేయడం వల్ల త్వరగా కోలుకున్నారని తెలిపారు. ఆపరేషన్‌లో డాక్టర్లు రవీంద్ర, కొండారెడ్డి, హిమబిందు, పీజీలు పాల్గొన్నారని చెప్పారు.

ఉరి వేసుకుని బాలింత ఆత్మహత్య


మృతి చెందిన గీత

ఆదోని రూరల్: మండలంలోని కడితోట గ్రామంలో ఓ బాలింత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై పెద్దతుంబళం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడితోట గ్రామానికి చెందిన బోయ గీత (22)ను మంత్రాలయంకు చెందిన నరసింహకు రెండేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. గీత కాన్పు కోసం పుట్టినిల్లు కడితోట గ్రామానికి వచ్చి నాలుగు నెలల కిందట శిశువును ప్రసవించింది. తర్వాత పొత్తి కడుపులో నొప్పి తరుచూ వస్తుండేదని, ఈ విషయాన్ని భర్తకు చెప్పగా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి మునెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీబీఐ పేరుతో సైబర్ కేటుగాళ్ల మోసం

- డాక్టర్‌ను బెదిరించి రూ. 38 లక్షలు స్వాహా

బొమ్మలసత్రం: నంద్యాలలో ప్రైవేటు ఆసుపత్రి యజమానిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి రూ.38 లక్షలు దోపిడీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ రామయ్య పద్మావతి నగర్‌లో రాహుల్ ఆసుపత్రి నిర్వహిస్తున్నాడు. గత నెల 25న సైబర్ నేరగాళ్లు రామయ్యకు వాట్సాప్ కాల్ చేశారు. తాము సీబీఐ అధికారులమని, నీ సెల్ నంబర్ ఆధారంగా మనీలాండరింగ్ జరిగింది. దీనిపై ఢిల్లీ పీఎస్‌లో హ్యూమన్ ట్రేడింగ్, మనీలాండరింగ్, చీటింగ్ కేసులు నమోదయ్యాయని భయపెట్టారు. దీనిపై ఆన్‌లైన్ విచారణ జరుపుతున్నామని, డిజిటల్ అరెస్ట్ చేశామని బెదిరించా రు. అరగంట సేపు డాక్టర్‌ను కాల్‌లో ఉంచి ఆయన బ్యాంక్ అకౌంట్‌ను హ్యాక్ చేసి రూ.38 లక్షలు కాజేశారు. కొంత సేపటికి తేరుకున్న డాక్టర్ రామయ్య వెంటనే టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఈ-క్రాప్ బుకింగ్ ప్యూరిఫికేషన్‌కు చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్‌లో నమోదు చేసిన పంటలను ప్యూరిఫికేషన్ చేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటలపై పలు అనుమానాలు ఉత్పన్నమయ్యాయి.అనేక గ్రామాల్లో పంటల సాగు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నప్పటికీ పంటల నమోదు మాత్రం తక్కువగా ఉంది. సీసీఆర్‌సీ కార్డులు భారీగా జారీ చేసినప్పటికీ వీటికి సంబంధించి పంటల నమోదు మాత్రం తక్కువగా ఉంది. ఒకే రైతు, ఒకే ఆధార్‌పై వివిధ పంటలు ఎక్కువ సాగు ఉన్నట్లు నమోదైంది. వీటిని సమగ్రంగా పరిశీలించి ప్యూరిఫికేషన్ చేసేందుకు వ్యవసాయ కసరత్తు మొదలైంది. ఈ-క్రాప్ బుకింగ్ డేటాను మండల ఏఓ లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ప్యూరిఫికేషన్ ప్రక్రియ చేపట్టాలని వ్యవసాయ శాఖ ఆదేశించిన నేపథ్యంలో గురువారం సబ్ డివిజినల్ ఏడీఏలు మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ప్యూరిఫికేషన్ చేయాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి ఆదేశించారు. సమావేశంలో సాంకేతిక వ్యవసాయ అధికారి దస్తగిరిరెడ్డి, ఏఓలు పాల్గొన్నారు.

రెండో పటాలం అదనపు కమాండెంట్‌గా నాగేంద్రరావు

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలం అడిషనల్ కమాండెంట్ ప్రభుకుమార్ స్థానంలో నాగేంద్రరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేస్తుండగా బదిలీల్లో భాగంగా ఆయనకు పదోన్నతి కల్పించి గురువారం కర్నూలు రెండో బెటాలియన్‌కు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే కర్నూలు హోంగార్డ్స్ డీఎస్పీగా ఉన్న కృష్ణమోహన్‌రెడ్డికి ఏఎస్పీగా పదోన్నతి కల్పించి కర్నూలులోని ఖాళీ స్థానంలో నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఏఆర్ కర్నూలు అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న నాగబాబుకు నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి కల్పించి ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

తగ్గుతున్న టమాట ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): టమాట ధరలు తగ్గుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో సాగు చేసిన టమాట దిగుబడులు మార్కెట్‌లోకి వస్తున్నాయి. గురువారం పత్తికొండ మార్కెట్‌కు 66.50 టన్నుల టమాట వచ్చింది. క్వింటాలుకు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.4500 లభించింది. మోడల్ ధర రూ.3200గా నమోదు అయింది, రైతుబజార్లలో కిలో రూ.30 ప్రకారం విక్రయిస్తున్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,241	7,170
పొద్దుతిరుగుడు	2,690	5,970
ఆముదం	4,388	5,950
వాము	5,099	21,040
ఉల్లి	495	3,829
ఎండుమిర్చి	2,899	7,801
శనగలు	3,509	3,509
కందులు	9,471	9,671
మొక్కజొన్న	2,158	2,330
మినుములు	6,321	8,329
కొర్రలు	2,389	3,091
సోయాచిక్కుడు	2,869	2,869
సజ్జలు	2,071	2,100

ఫోన్ నం : 08518–257204, 257661